క్లుప్తంగా

అన్నదాన ట్రస్టుకు విరాళం



ట్రస్టుకు విరాళం అందజేస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని అన్నదాన ట్రస్టుకు మంగళవారం ఓ దాత నగదు విరాళం చేశారు. ఏలూరుకు చెందిన బాలకృష్ణ ట్రస్టుకు రూ.1,25,000ను ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం వారికి ఆలయ అధికారులు వారికి స్వామి దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది వాసు, రవి తదితరులు ఉన్నారు.

బీఎన్‌ఆర్‌పేట సబ్‌స్టేషన్‌లో తనిఖీ



సబ్‌స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న ఎస్‌ఈ మునేంద్ర

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం బీఎన్‌ఆర్‌పేట చెక్‌పోస్ట్‌లోని సబ్‌స్టేషన్‌ను మంగళవారం విద్యుత్‌శాఖ ఎస్‌ఈ మునేంద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్ నిర్వహణపై ఆరా తీశారు. వర్షం పడినప్పుడు కరెంటు కోతలు, ఇతర సమస్యలను సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు. కరెంటు సరఫరాలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు.

మ్యాంగో బోర్డు కోసం ఆందోళన



కలెక్టరేట్ వద్ద కిసాన్ మోర్చా నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో మ్యాంగో బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ వద్ద కిసాన్ మోర్చా నాయకులు ఆందోళన చేశారు. కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కొత్తూరు బాబు మాట్లాడుతూ, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటుకు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మామిడి, టమాట, చెరకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ, జిల్లాలోని కో–ఆపరేటివ్, షుగర్ ఫ్యాక్టరీలను వెంటనే పునరుద్ధరించాలన్నారు. మామిడి గుజ్జు పరిశ్రమలను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. సీఎం చంద్రబాబునాయుడు రైతాంగ సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు యువరాజు, ఎల్లారెడ్డి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో ఉపలోకయుక్త రజని



వినాయకుడి సేవలో ఉపలోకయుక్త రజని

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని మంగళవారం రాత్రి రాష్ట్ర ఉపలోకయుక్త రజని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు దగ్గర ఉండి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో ఐరాల తహసీల్దార్ మహేష్, ఎస్‌ఐ రామ్మోహన్, ఆలయ సిబ్బంది కోదండపాణి తదితరులు ఉన్నారు.

హొసూర్ నుంచి కాలినడకన..



తిరుమలకు కాలినడకన వెళుతున్న భక్తులు

వి.కోట: తిరుమల వెంకన్నను దర్శించుకోవడానికి 250 మంది భక్తులు కాలినడకన తమిళనాడు రాష్ట్రం హొసూరు నుంచి తిరుమలకు బయలుదేరారు. మంగళవారం వి.కోట మండలం మీదుగా వీరి ప్రయాణం సాగింది. భక్తులను సాక్షి పలకరించగా ప్రతి ఏటా శ్రావణ మాసంలో తాము వెంకన్న దర్శనానికి 450 కిలోమీటర్లు కాలినడకన వెళతామన్నారు. తమ ప్రయాణం 8 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. కాలినడకన వెళ్లి మొక్కులను చెల్లించుకోవడం ప్రతి ఏటా తమ ఆనవాయితీగా వారు పేర్కొన్నారు.

గతి తప్పిన విద్యార్థి

విద్యార్థులు కొందరు తమ జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. గంజాయి ఊబిలో కూరుకుపోతున్నారు. వారి ఉజ్వల భవితకు వారే పొగ పెట్టుకుంటున్నారు. వాడకం నుంచి విక్రయం వరకు విద్యార్థుల హస్తం కనిపిస్తోంది. ఇప్పుడు ఏకంగా స్మగ్లింగ్ చేయడానికి సిద్ధమవుతున్నారు. తల్లిదండ్రుల కన్న కలలు నిజం చేస్తారనుకుంటే దారి తప్పుతున్నారు. అక్రమ సంపాదనతో జల్సాలు చేస్తున్నారు. వీరిని చూసి మరి కొందరు విద్యార్థులు ఈ ఊబిలోకి దిగుతున్నారు.

- గంజాయి ఊబిలో బీటెక్ స్టూడెంట్స్
- అక్రమ రవాణాలోకి దిగిన వైనం
- పోలీసుల విచారణలో వెల్లడి



పలమనేరు: విశాఖ నుంచి బెంగళూరుకు గంజాయి తరలించడంలో పలమనేరు పట్టణం కీలకంగా మారుతోంది. బెంగళూరులో గంజాయి సిగరెట్లకు మంచి గిరాకీ ఉంది. గంజాయి మత్తుకు అలవాటు పడిన వారికి ఇది లేకుండా పిచ్చి పట్టే పరిస్థితిని అక్కడి గంజాయి ముఠా తీసుకొచ్చింది. వారికున్న భారీ నెట్ వర్క్‌తో ఇచ్ఛాపురం నుంచి పలురకాల వాహనాల్లో 25 గంటలపాటు ప్రయాణించి బెంగళూరుకు గంజాయిని రవాణా చేయిస్తున్నారు. దాదాపు 1,264 కిలోమీటర్లు వీరు అత్యంత జాగ్రత్తగా వారి నెట్‌వర్క్ పనిచేస్తూ ఉంటుంది. ఇచ్ఛాపురం నుంచి 16వ నంబరు జాతీయ రహదారి మీదుగా నెల్లూరు, తిరుపతి బైపాస్, చిత్తూరు బైపాస్, పలమనేరు మీదుగా కర్ణాటకలో రాష్ట్రంలోకి అక్రమ రవాణా సాగుతోంది. ఈ మార్గంలో ముఖ్యమైన చెక్‌పోస్టులు, పోలీసుల తనిఖీలున్నప్పటికీ గంజాయి అక్రమ రవాణా సాగుతూనే ఉంది.

గంజాయి మత్తులో చిత్తవుతున్న యువత

మత్తుకు అలవాటు పడిన వారు గంజాయి లేకుంటే బతకలేని స్థితికి చేరుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని తిరుపతి, చిత్తూరు, పలమనేరు, పుంగనూరు, పీలేరు, కుప్పంలో ఇప్పటికీ మత్తుకు బానిసైన వారికి ప్యాకెట్లు అందుతున్నాయంటే ఆయా ప్రాంతాల్లో గంజాయి విక్రయించే ఏజెంట్లు ఇంకా కొనసాగిస్తున్నారు. రూ.వంద నుంచి వెయ్యి వరకు సైజులవారిగా వీటిని ప్యాకెట్లలో పెట్టి ఖాళీ సిగరెట్ ప్యాక్‌లో నింపి అమ్ముతున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా గంజాయి కారణంగా ఎంతో భవిష్యత్తున్న యువకుల జీవితాలు సర్వనాశనమవుతున్నాయి. గంజాయి స్మగ్లింగ్, విక్రయాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో మరింత ఫోకస్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయమై స్థానిక సెబ్ సీఐ సురేష్ రెడ్డిని వివరణ కోరగా ఇప్పటికే స్థానికంగా గంజాయి అక్రమ రవాణాదారులపై కేసులు పెడుతున్నామన్నారు. తాజాగా ఐదుగురు స్టూడెంట్స్ గంజాయిని వైజాక్ నుంచి బైక్‌లపై తెచ్చి ఇక్కడి ఏజెంట్లకు అమ్ముతుండగా దాడులు చేసి పట్టుకున్నామని, వారిచ్చిన సమాచారంతో లోతుగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



పోలీసులకు పట్టుబడిన గంజాయి పార్శిల్స్ (ఫైల్)

ఇవీ సంఘటనలు

- వారం క్రితం తిరుపతిలో చదువుతున్న పలమనేరు నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు బైక్‌లపై విశాఖకు వెళ్లి గంజాయి తీసుకుని ఇక్కడకు వచ్చేశారు. ఇక్కడ స్థానిక విద్యార్థులకు ఆ గంజాయి విక్రయిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని విచారించగా తిరుపతిలోని బీటెక్ విద్యార్థులు గంజాయి వ్యాపారంలో బాగా సంపాదిస్తూ జల్సాలు చేస్తున్నారని, వీరిని చూసి మరి కొందరు స్టూడెంట్స్ ఈ వ్యాపారంలోకి దిగినట్లు తేలింది.
- గతంలో పట్టణ సమీపంలోని బైపాస్ రోడ్డు వద్ద ప్రమాదానికి గురైన వాహనంలో భారీగా గంజాయిని స్థానిక పోలీసులు గుర్తించారు. డ్రైవర్‌ను విచారించగా సరుకు బెంగళూరుకు వెళుతోందని హొసకోట వద్ద దీన్ని తీసుకెళ్లే కొరియర్లున్నారని చెప్పాడు.
- ఇటీవల పలమనేరు పోలీసులు గాంధీనగర్ బస్టాప్ వద్ద ఆటోల్లో గంజాయిని బెంగళూరుకు తరలించే ముఠాను అరెస్ట్ చేశారు. వీరు చిన్నచిన్న ప్యాకెట్లుగా గంజాయిని సిద్ధం చేసుకుంటుండగా పోలీసులు పట్టుకున్నారు.
- ఏకంగా అంబులెన్స్‌లో తరలిస్తున్న ముఠాను గంగవరం పోలీసులు గతంలో పట్టుకున్నారు. బొలేరో, ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో బొలేరోలో గంజాయి ప్యాకెట్లను పలమనేరు పోలీసులు గుర్తించారు. వాహనంలోని సీట్లకింద, బ్యానెట్, ఇంజిన్‌లో కనిపించకుండా తీసుకెళ్తున్న విషయం బట్టబయలైంది. మరికొందరు విశాఖ నుంచి బెంగళూరుకు బైక్‌లపై గంజాయిను తరలిస్తున్నట్టు ఇప్పటికే సెబ్ అధికారులు పసిగట్టారు.

ప్రైవేటు అర్చకుల నుంచి దరఖాస్తులు

కాణిపాకం: ప్రైవేటు దేవస్థాన అర్చకులకు ప్రభుత్వం కనీస వేతనం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుందని, ఈ మేరకు అర్హులైన అర్చకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా దేవదాయశాఖ ఏసీ ప్రసన్నలక్ష్మి తెలిపారు. ఆ అర్చకులు దరఖాస్తు ఫారం పూర్తి చేసి ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్స్ నకలు పత్రాలు, ఫొటోలను జత చేసి బుధవారం సాయంత్రంలోపు చిత్తూరు నగరం చర్చివీధిలోని దేవదాయశాఖ ఏసీ కార్యాలయానికి అందజేయాలన్నారు. దరఖాస్తుకు ఒక్క రోజు గడువు ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వేడుకగా చిత్తూరమ్మ ఊరేగింపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని పెద్దహరిజనవాడలో వెలసిన శ్రీ చిత్తూరమ్మ దేవస్థానంలో మంగళవారం ఆడి ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి విశేష పూజలు చేసి సుందరమయంగా అలంకరించారు. అలాగే ఉత్సవ విగ్రహాన్ని పలు రకాల పుష్పాలతో తీర్చిదిద్ది నగర వీధుల్లో వైభవంగా ఊరేగించారు. భక్తులు కర్పూర హారతలు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

రాయితీ పరికరాలకు దరఖాస్తులు

బంగారుపాళెం: రైతులు రాయితీ డ్రిప్ పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారి సాగరిక మంగళవారం తెలిపారు. వ్యవసాయ సాగులో బిందు, తుంపర్ల పద్ధతిలో అవలంభించే రైతులకు ప్రభుత్వం రాయితీతో పరికరాలను అందిస్తున్నట్లు చెప్పారు. 5 ఎకరాల పొలం ఉన్న చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీతో డ్రిప్, స్ప్రింక్లర్లను అందించడం జరుగుతోందన్నారు. 5 ఎకరాలు పైన ఉన్న రైతులకు 70 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు చెప్పారు. రాయితీ పరికరాలు అవసమైన రైతులు పొలానికి సంబంధించిన 1బి, ఆధార్ జిరాక్సు కాపీలతో వెళ్లి రైతుసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చిరుద్యోగుల తొలగింపులు ఆపండి

– వైఎస్సార్ టీయూసీ జోనల్ ఇన్‌చార్జ్ ఎస్.రాజారెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి రాష్ట్రవ్యాప్తంగా చిరుద్యోగులపై నిర్దాక్షిణ్యంగా దాడులను ప్రారంభించిందని వైఎస్సార్‌టీయూసీ జోనల్ ఇన్‌చార్జ్ నారపరెడ్డి రాజారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఐకేపీ, వీవోఏ, మధ్యాహ్న భోజనపథకం, పారిశుద్ధ్య కార్మికులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, స్టోర్‌డీలర్లపై సాగిస్తున్న దమనకాండను తక్షణం ఆపి, వారి ఉద్యోగాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిరుద్యోగులు అడగ్గానే జీతాలు రెట్టింపు చేసిందన్నారు. ప్రస్తుతం ఉద్యోగాలను తొలగించడమే కాకుండా భౌతిక దాడులకు పూనుకోవడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వంలోని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలకు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వశాఖల్లో ఖాళీలను సృష్టించి వాటిని అమ్ముకోవడానికి నాయకులు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. తమను ఎప్పుడు తొలగిస్తారో అని స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు భయపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ స్థానంలో బీమా విధానాన్ని తీసుకురావాలని చూస్తోందని, దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న 2600 మంది ఆరోగ్య మిత్రలను తొలగించడానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. వీరంతా డిగ్రీ, పీజీ, బీఎస్సీ నర్సింగ్, బీఫార్మసీ అర్హత కలిగి సుమారు 20ఏళ్లుగా పనిచేస్తురన్నారని, వారి పొట్ట కొట్టవద్దని హితవు పలికారు.



నారపరెడ్డి రాజారెడ్డి

రక్తహీనతతో ఆరోగ్య సమస్యలు

ఐరాల: మహిళల్లో రక్తహీనత సమస్య వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని గుండ్లపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 75 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రసవం తర్వాత చాలామంది మహిళల్లో ఐరన్ లోపంతో రక్తహీనత ఏర్పడి నీరసం, కళ్లు తిరగడం, ఆయాసం, నాడి వేగం పెరగడం తదితర లక్షణాలు కనిపిస్తామన్నారు. వెంటనే ఈ సమస్యను అధిగమించాలని లేకుంటే గుండె సంబంధిత సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



కె.పట్నంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: గర్భిణులు సకాలంలో వైద్య పరీక్షలు చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని వైద్యాధికారి ప్రియాంక సూచించారు. మండలంలోని కె.పట్నంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామంలో వీధులను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ హరి, ఆరోగ్య కార్యకర్త శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలలోనే పోషక విలువలు

తవణంపల్లె: తల్లిపాలలోనే పోషక విలువలు అధికంగా ఉంటాయని ఐరాల సీడీపీఓ నిర్మల తెలిపారు. మంగళవారం మండలంలోని దిగుమోదాల పల్లెలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ తల్లిపాలలో వ్యాధి నిరోధకశక్తితో పాటు పోషక విలువలు అధికంగా ఉంటాయన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని తెలిపారు. బిడ్డకు తల్లిపాలు పట్టడం వల్ల ఆరోగ్యంగా, శక్తివంతంగా ఎదుగుతారని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సావిత్రి, గర్భిణులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం ముఖ్యం

చిత్తూరు కలెక్టరేట్ : ఉన్నత చదువు చదివే విద్యార్థుల్లో పోటీతత్వం ముఖ్యమని కౌటిల్య బ్యాంక్ కోచింగ్ నిర్వాహకులు ఎస్.ఎస్.రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పర్సనల్ డెవలప్‌మెంట్, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వివిధ పోటీపరీక్షల్లో రాణించాలంటే పోటీతత్వం కచ్చితంగా ఉండాలన్నారు. నిరంతర విశ్లేషణాత్మక అధ్యయనం చాలా ముఖ్యమని చెప్పారు. తద్వారా ఎలాంటి ఉద్యోగమైనా సులువుగా సాధించవచ్చని తెలిపారు. ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు చెడువ్యసనాలకు లోనుకాకూడదని తెలిపారు. ఉన్నత లక్ష్యంతో ముందుకు వెళ్తే భవిష్యత్‌లో మంచి ఉద్యోగాలు సాధిస్తారన్నారు. ఆత్మవిశ్వాసం, విషయజ్ఞానం ఉన్నంతవరకు అపజయమంటూ ఉండదని తెలిపారు. ఓటమికి కుంగిపోకూడదని, ప్రయత్నం చేస్తూ ఉంటే ఫలితం కచ్చితంగా ఉంటుందన్నారు. అనంతరం బ్యాంక్ కోచింగ్ నిర్వాహకులు ఎస్ఎస్ రెడ్డిని దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో సెట్విన్ మేనేజర్ మోహన్‌కుమార్, జేకేసీ సమన్వయకర్త బాబు, అధ్యాపకులు శరవణ, సుభాషిణి, బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎన్ఎస్‌రెడ్డిని దుశ్శాలువతో సత్కరిస్తున్న ప్రిన్సిపల్ జీవనజ్యోతి

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ అధికారి శోభారాణి

తవణంపల్లె: గర్భిణులు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను భుజించాలని అరగొండ అపోలో నర్సింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ అధికారి శోభారాణి తెలిపారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం అరగొండ అపోలో నర్సింగ్ కళాశాలలో పోషక విలువలు కలిగిన వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. పోషక విలువలు కలిగిన పదార్థాలను భుజించడం వల్ల రక్తహీనతను అరికట్టవచ్చని సూచించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత ఆహార నియమాల గురించి వివరించారు. ఈ నెల 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలపై గ్రామంలో తిరిగి ఎన్ఎస్ఎస్ వలంటీర్లచే (విద్యార్థులు) అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, వైద్యసిబ్బంది, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి, సీహెచ్‌ఓ రాజామణి పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ

– డీఈఓ దేవరాజులు



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న డీఈఓ దేవరాజులు

ఐరాల: ప్రతి విద్యార్థిపై టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి వారి భవితకు బాటలు వేయాలని డీఈఓ దేవరాజులు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, రికార్డులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి స్కూలుకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మెనూ ప్రకారం పెట్టారని కితాబిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓలు రుషేంద్ర బాబు, దామోదర్‌నాయుడు, హెచ్‌ఎం కోమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌరులు ప్రపంచశాంతికి పాటు పడాలి



టేకుమంద జెడ్పీ హైస్కూల్‌లో నో వార్ ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

- విజ్ఞానశాస్త్రం మానవాళి అభివృద్ధికి దోహదపడాలి
- హిరోషిమా డే కార్యక్రమంలో ఉపాధ్యాయులు

బంగారుపాళెం: ప్రపంచ శాంతిని నెలకొల్పేందుకు విద్యార్థులు పాటు పడాలని టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వేణు రెడ్డి అన్నారు. మండలంలోని టేకుమంద జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం హిరోషిమా డేని ఏపీజే కలాం సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా ఆగస్టు 6వ తేదీ జపాన్ నగరంలోని హిరోషిమా పట్టణంపై బాంబర్ బీ–29 ప్రయోగించిందన్నారు. దీన్ని లిటిల్‌బాయ్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. అణుబాంబు సృష్టించిన విధ్వంసం మరచిపోని దుర్ఘటన అని అన్నారు. ఆనాడు జరిగిన అపార ప్రాణ నష్టానికి గుర్తుగా ×హిరోషిమా పీస్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హిరోషిమా డే నిర్వహిస్తూ ప్రపంచ శాంతికి పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. సైన్స్ క్లబ్ ప్రతిపాదకులు షంషీర్‌ఖాన్, విజయకుమారి మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రం మానవాళి అభివృద్ధికి దోహదపడాలే కానీ వినాశకరం కాకూడదన్నారు. శాస్త్ర పరిజ్ఞానం దుర్వినియోగం అవడానికి హిరోషిమా, నాగాసకి దుర్ఘటనలు సాక్ష్యాలని తెలిపారు. అనంతరం ×నో వార్₹ అక్షర ఆకారంలో విద్యార్థులు కూర్చుని ×యుద్ధం వద్దు–ప్రపంచ శాంతి ముద్దు₹ అంటూ నినదించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేశవులు, దేవకి, వెంకటస్వామి, జయప్రకాష్, వెంకటరమణ, అన్నపూర్ణదేవి, శుభలక్ష్మి, సైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పరామర్శ



ప్రతాప్‌ను పరామర్శిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్, నాయకులు

బంగారుపాళెం: మండలంలోని తుంబకుప్పంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తను మంగళవారం నాయకులు పరామర్శించారు. రెండు రోజుల కిందట టీడీపీ కార్యకర్తల దాడిలో ప్రతాప్, అతని భార్య శాంతి గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, ఎంపీపీ అమరావతి, సీనియర్ నాయకులు విద్యాసాగర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ లీలావతమ్మ, మాజీ సర్పంచ్ అరుణామల్‌రెడ్డి, మునిరత్నం, మంజునాథ్ బాధితులను కలిసి ధైర్యం చెప్పారు. కార్యకర్తలకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.